# నిష్కామకర్మ

తనతండ్రి చావుబతుకుల్లో ఉన్నాడని తెలియగానే శోభ నాద్రి అంతస్సు ఒక్కపెట్టున జయధ్వానం చేసింది. "చస్తాడు, ముసలాడు! వాళ్ళ ఊరికి పీడవదిలి పోతుంది, భూ భారం తీరిపోతుంది, ప్రపంచంలో ఉన్న ప్రాణ వాయువు పరిశుద్ధం అవుతుంది!"

ఈ జయధ్వానం వినగానే శోభనాద్రికి ముచ్చెమటలు పోసినై. అతనికి సిగ్గుకూడా కలిగింది. తనకు అంత నీచ మైన ఆలోచన రావటమేమిటి ?

ఎందుకంటే శోభనాద్రికి రెండు అంతరాత్మలున్నై. ధైర్యం కలవాడికి ఒకటే అంతరాత్మ ఉంటుంది. పిరికి వాడికి మాత్రం రెండు ఉంటై. శోభనాద్రి అమిత పిరికి వాడు.

శోభనాద్రి రెండో అంతరాత్మ, "నీధర్మం మరవకు. ఆయన కర్కోటకుడు కావచ్చును. నీ జీవితాన్ని ధ్వంసం చేసి ఉండవచ్చును. కాని నీ తండ్రి. తండ్రి అన్నేపేమ

నీకు లేకపోయినా ఇబ్బంది లేదు. నీ ప్రవర్తనను జాగ్రత్తగా కాపాడుకో. విధి నెరవేర్చు. నీతండ్రికి ద్రోహం చేసే ఆలోచన చేసి నీకు నువ్వే ద్రోహం చేసుకోకు!'' అంటున్నది.

ఒకవారం రోజులు సెలవు పెట్టి శోభనాద్రి తండ్రిని చూడటానికి బైలుదేరాడు. రైలులో కూర్చున్నది లగాయతు ఇదే ఆలోచన.

తనతండ్రి తనజీవితాన్ని కాలమేఘం ఆవరించినట్లు ఆవరించి, ఎక్కడా ఒక చిన్న సూర్యకిరణం ఎరగకుండా చేశాడు తనను. తనకు బుద్ధి తెలియక పూర్వంనించికూడా తను తన ఆనందంకోసం ఒక్కపనిచేసి ఎరగడు. పోనీతండ్రి అయినా ఆనందించాడా? ఊరికే మెప్పయినా వచ్చిందా? కనీసం సమ్మతి అయినా? ఒక్కనాడు లేదు. క్రియకు తను ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ వచ్చినట్టే అయింది. ఆవిధంగా తను రెంటికీ చెడ్డాడు.

తన ఇష్టా యిష్టాలను చంపుకున్నందుకు తండ్రి చేసిన బహుమానం ఏమంటే తన బి. ఏ. చదువు మొగ్గలో తుంచటమూ, పోయి సంపాదించుకోమని ఇంటోనించి తరమటమూనూ! ఆగోడౌను కీపరుఖాళీ వచ్చినప్పుడు తను కష్టపడి అంతమంచి శిఫారసు తెచ్చుకున్నా తండ్రి సెక్యూరిటీ కట్టనని అది కాస్తా పాడుచేశాడు—తా్రిష్టుడు!

సంవత్సరానికి ఇరవై పుట్ల చొప్పున వచ్చే ఆస్తి సంపాదించాడు, ఉద్యోగంలో ఉన్నరోజుల్లో రెండు చేతులా లంచాలు పట్టి! అదంతా ఎట్లా ఖర్చుచేస్తాడో ఏమో, ప్రతి దానికీ డబ్బులేదంటాడు. గర్భదరిద్రులైనా అనుభ

వించేటప్పు డనుభవించి మాడేటప్పుడు మాదతారు.

ఎంత పాపిష్టి వాళ్ళనుకూడా ఎవరో ఒకరు ఎప్పుడో ఒకప్పుడు "అయ్యో! పాపం!" అంటారు. తన తండ్రిని లోకం పాపిష్టివాడికింద చూడకపోవచ్చునుకాని "అయ్యో! పాపం!" అనాలనిమాత్రం ఎవరికీ ఆయనవిషయమై ఆలోచన పోదు. తన జీవితపు ఇతర అసభ్యతలకు తోడు ఇటువంటి తండ్రి!

తను ఎట్లా తిండిలేక మాడాడో, ఎవరెవరి కాళ్ళు పట్టుకున్నాడో, ఎవరెవరిని ప్రాధేయపడి, ఎంత కష్టం మీద ఈగుమస్తాగిరీ ఈపాతిక రూపాయల జీతమూ సంపాదించాడో, తన తండ్రికి ఏం తెలుసు?

ఏమైతే ఏం, ఇక తనకష్టాలు గట్టెక్కినట్టే. ఈపాతికా తనకు సరిపోతై. ఇందులో ఐదారు మిగులుతైకూడాను. తనకు కిల్లీకూడా అవసరంలేదుకదా! ఇక తన తండ్రి తననేం బాధపెట్టగలడు? తను ఒక వందరూపాయలు వెనకవేసుకో గలిగాడుకూడానూ. ఆవందా ఖర్చుపెట్టి పెళ్ళిచేసుకుంటే పాతికరూపాయలమీద ఇద్దరూ హాయిగా బతకవచ్చును. ముందు ముందు పిల్లలు పుడతారూ? కానీ, కాలం ఎప్పుడూ ఒకవిధంగానే ఉంటుందా?

శోభనాద్రి తండ్రిని చూశాడు. ఆయనకు నంజువ్యాధి. వైద్యంగాని, పథ్యంగాని ఏమీలేదు. కొడుకును చూడగానే తల్లి ఆవురుమని ఏడ్చింది. ఆవిడ గర్భవాసాన పాపం, లేకలేక ఒక్కకొడుకు.

"ఏమిటమ్మా! ఆయనకు వైద్యం ఎందుకు చేయించటం

లేదూ ?" అన్నాడు శోభనాద్రి.

"ఏమో, మీనాన్నకు అశ్రద్ధ. పిత్తనంలో వచ్చే జబ్బులు నయమయిందాకా నమ్మకమేమిటి, నాయనా? ముందు వైద్యులకు మాత్రం బోలెడంత పొయ్యాలి!"

శోభనాద్రి తల తిరిగి పోయినట్టయింది. తనతల్లి వైధవ్యాన్ని అటువంటి వేదాంతంతో ఎదుర్కొంటున్నదా? ఇంట్లో రుగ్మత ఆమెకుగాని తన తండ్రికి గాని ఈషణ్మాత్రం, మీద ఈగవాలినట్టయినా లేదా? తను మాత్రం అపరిపూర్ణమైన ఆరోగ్యాన్ని సహించలేడు.

అతను వెంటనే ఇల్లుబయలుదేరివెళ్ళి మంచి డాక్టరును పిలుచుకువచ్చాడు. డాక్టరు రోగిని పరీక్షించి "నయం కావచ్చును వైద్యంచేదాం!" అన్నాడు. సరే మందిస్తూ ఉండమన్నాడు శోభనాద్రి.

డాక్టరు వెళ్ళిపోగానే తండ్రి కొడుకుమీద ఎగిరిపడ్డాడు. ఈడాక్టర్లు బోలెడంత డబ్బు కాజేస్తారు. ఏమిటి వాళ్ళు చేసేవైద్యం, వాళ్ళ మొహం?

"మంచానపడి ఉన్నవాడివి పడివుండక తర్కించవస్తావేమిటి? నేనిక్కడ ఉన్నంతసేపూ నాయిష్టప్రకారం నడవాలిసిందే!" అని శోభనాద్రి బిగ్గరిగా అరిచాడు.

అతనికి తండ్రిమీద కోపంకంటె ఆయన్నుచూస్తే ఆశ్చర్యం ఎక్కువ కలిగింది. ఆయన మనస్తత్వంఏమిటో అతను ఊహించలేకపోయినాడు. డబ్బుకన్న ఇంకేమీ ఆయనకు ఎక్కువగా కనిపించదా? తనప్రాణంకూడా? ప్రాణంపోతే డబ్బేం చేసుకుంటాడు? తనకు డబ్బుకన్న

తక్కువైనవి బహుకొద్దిగా కనిపిస్తై. ఇద్దరు సామాన్య మనుష్యుల దృష్టిలో ఇంత తేడా ఏమిటి?

తను వెళ్ళిన మరుక్షణం డాక్టరును ఇంటో అడుగుపెట్ట నివ్వడు తండ్రి. శోభనాద్రి ఒకనెలరోజుల సెలవుకోసం వ్రాశాడు. మూడోరోజుకుతిరిగి సమాధానం వచ్చింది— వీలుపడదనీ, వారం కాగానే బయలుదేరి రమ్మనీ. జీతం లేకుండానైనాసరే శలవిప్పించమని ప్రాధేయపడుతూ శోభనాద్రి మళ్ళీ ఉత్తరం రాశాడు. జవాబులేదు.

తండ్రి మందులకూ ఇంజక్షనులకూ శోభనాద్రి తన డబ్బే వాడుతున్నాడు. మొత్తంమీద రోగం తిరుగుముఖ మైంది డాక్టరుకూడా సంతోషించాడు.

"ఇంత త్వరలో రోగం దారికి వస్తుందని నేను నా అంత రాత్మలో అనుకోలేదు," అన్నాడు డాక్టరు.

"వాళ్ళు డబ్బు గుంజటానికి అట్లాగే అంటారులే!" అన్నాడు తండ్రి.

శోభనాద్రికి నెలాఖరుకు జీతమూ ఉద్యోగం ఊడిన వార్తా వచ్చినై. అతడు కన్నీళ్ళు ఆపుకోవటం దాదాపు అసంభవమయింది. తన కెందుకీపంట? తను అతిప్రయ త్నంమీద నిలవచేసిన డబ్బు అయిపోతున్నది. తండ్రికి పాంతంగా నయమయేటప్పటికి ఒక కానీ మిగలదు. ఉద్యో గం ఊడింది. మళ్లీ కడుపుమాడటమూ, ఆశ్రయింపూ, అవమానమూ, ఇంకొక బానిసతొత్తు నౌకరీనీ!

"ముసలాణ్ణి ఎందుకు చావనివ్వకపోయినావు? సంవత్స రానికి ఇరవైపుట్లు! స్వేచ్ఛ! తగుదునమ్మా అని ఏమని

వచ్చి ఆ ముసలి ప్రాణానికి అడ్డుపడ్డావు? ఇవాళ నంజు నయంచేశావు. రేపు ఏరోగమూ లేకుండా చస్తాడు; ఆపుతావా?" అన్నది ఒక అంతరాత్మ.

"ఏమయితేనేం? ఒక ప్రాణం దక్కించావు. నీ చేతిలో లేకుండా పొయ్యే ప్రాణమూ, నీ ఎదట నిష్కారణంగా పొయ్యే ప్రాణమూ ఒకటేనా? ఆయన్ను చావనిచ్చి ఉంటే నీ ఆత్మగౌరవం, నీ వ్యక్తిత్వం దక్కి ఉండునా? నీ వ్యక్తిత్వం ఎక్కువా, ఇరవై పుట్లెక్కువా? నీ వ్యక్తిత్వం కోసం నువు ఒకప్పుడు అన్నిరకాల బాధలూ, అవమానాలూ సహించినవాడివి కావా? అప్పటికీ ఇప్పటికీ తేడా ఏముంది?" అన్నది మరొక అంతరాత్మ.